క్లుప్తంగా

కంచర్లలో వైద్య పరీక్షలు



వీర్నపల్లి: కంచర్ల గ్రామంలో మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సారియ అంజుం ఆధ్వర్యంలో గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. 67 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశామని, 26 మందికి రక్త పరీక్షలు నిర్వహించామన్నారు. సూపర్‌వైజర్ ఇందిర, ఎంఎల్‌హెచ్‌పీ చైతన్య, హెల్త్ అసిస్టెంట్ రమేశ్, ఏఎన్‌ఎం రూతమ్మ, ఆశ కార్యకర్తలు రజిత, రాణి పాల్గొన్నారు.

క్షయ నివారణ పరీక్షలు



పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బోయినపల్లి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారి కార్తిక్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు గురువారం ముందస్తు క్షయ వ్యాధి నివారణ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కార్తిక్ మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులతో సహజీవనం చేస్తారు కనుక పరీక్షలు ఉపయోగపడతాయని తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ మహ్మద్ అజీజ్, టీబీ పర్యవేక్షకులు శశికుమార్, హేమలత, బిల్ల అశోక్, గంగాధర్ తదితరులున్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం

ఎల్లారెడ్డిపేట: రైతులు, పాలకవర్గం సభ్యులు మార్కెట్ కమిటీ అభివృద్ధికి సహకరించాలని ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం అన్నారు. రాచర్ల బొప్పాపూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గం సమావేశం గురువారం నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లల్లో వేగం పెంచి పూర్తి చేయాలన్నారు. కొనుగోలు చేసిన వడ్లకు వెంటనే డబ్బులు చెల్లించేలా కృషి చేయాలని అన్నారు. రెండు నెలల ఆదాయ, వ్యయాలను సమీక్షించారు. సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, డైరెక్టర్లు సుడిది రాజేందర్, కృష్ణారెడ్డి, రవీందర్, మర్రి నారాయణరెడ్డి, మెండే శ్రీనివాస్, గంట లక్ష్మి, పొన్నాల తిరుపతిరెడ్డి, సత్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాసం అందజేత

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని శ్రీకృష్ణ గోశాలకు రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన దామ గణేశ్ 64 కట్టల ఒక ట్రాక్టర్ గడ్డి, ఇల్లంతకుంట గ్రామానికి చెందిన సుమలత ట్రస్ట్ 50 కట్టలతో కూడిన ఒక ట్రాక్టర్ లోడ్ వరి గడ్డి గురువారం అందజేశారు. ఆంజనేయులు, కీర్తి మహేశ్, పరశురాం, బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డంతా మురుగే..



ముస్తాబాద్: ముస్తాబాద్‌లోని వెంకటేశ్వర వీధిలో రోడ్డుపై మురుగు నీరు పారుతోంది. రెండో వార్డు పరిధిలోని గల్లీలో డ్రైనేజీ లేకపోవడంతో ఇళ్లలోని మురుగు నీరు ఇలా రోడ్డుపై పారుతోంది. దీంతో దోమలు, ఈగలు వ్యాపిస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దుర్గంధం వెదజల్లుతోందని, చిన్నపాటి వానకే మురుగు నీరు రోడ్డుపైకి వస్తోందన్నారు. ఇళ్లలోకి కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. పంచాయతీ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

కార్యవర్గం ఎన్నిక

బోయినపల్లి: మండల ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ యూనియన్ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అల్లూరి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కల్లెపెల్లి చెంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా చిట్టిమల్ల అరవింద్, సహాయ కార్యదర్శిగా రంగు నరేశ్, కోశాధికారిగా మిట్టపల్లి శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సెస్ భవనానికి నిధులు మంజూరు

- టెండర్లు పిలిచిన అధికారులు
- శాఖలవారీగా గదుల నిర్మాణం



బోయినపల్లి సెస్ భవనం ప్లానింగ్



అద్దె భవనంలో సెస్ కార్యాలయం

బోయినపల్లి: మండల కేంద్రంలో సెస్ భవన నిర్మాణానికి ఎట్టకేలకు అడుగులు పడుతున్నాయి. సెస్ భవన నిర్మాణానికి రూ.66లక్షలు మంజూరయ్యాయి. 30 సంవత్సరాలుగా అరకొర వసతులతో అద్దె భవనాల్లో సెస్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. సెస్ కార్యాలయానికి సొంత భవనం నిర్మాణమైతే ఉద్యోగుల ఇబ్బందులు తొలగనున్నాయి. బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే బీటీ రోడ్డులో కేజీబీవీ పాఠశాల పరిసరాల్లో ఉన్న 20 గుంటల సెస్ స్థలంలో భవనం నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సెస్ డైరెక్టర్ చొరవతో..

బోయినపల్లిలో సెస్ సేవాసదన్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మండల సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్ పలు సందర్భాల్లో సెస్ చైర్మన్ చిక్కాల రామారావుతోపాటు సెస్ ఎండీలను కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో రూ.66లక్షల మేర సెస్ నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో రెండంతస్తులతో భవన నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన బిల్డింగ్ ప్లాన్ సైతం సిద్ధం చేశారు. సెస్ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో సెస్ డైరెక్టర్ గది, సెస్ ఏఏఈ గది, కలెక్షన్ గది(బిల్లింగ్ సెక్షన్), అకౌంట్ సెక్షన్, వినియోగదారుల వేయిటింగ్ హాల్, స్టోర్ రూం, బాత్రూము లుంటాయి. పైన ఫ్లోర్‌లో రెస్ట్ హౌస్, బాల్కని, వేయిటింగ్ రూం, టాయిలెట్లుంటాయని సెస్ ఏఏఈ ప్రశాంత్ తెలిపారు.

వినియోగదారుల తాకిడి ఎక్కువ..

మండలంలోని 23 గ్రామాలకు గాను ఆరు విద్యుత్ సబ్ స్టేషన్లున్నాయి. డొమాస్టిక్, కమర్షియల్, ఇండస్ట్రీస్, వీధి లైట్లు అన్ని కేటగిరీలు కలిసి సుమారు 24వేల విద్యుత్ కనెక్షన్లున్నాయి. సెస్ సేవాసదన్ కార్యాలయానికి విద్యుత్ కనెక్షన్లు, మీటర్ పేరు మార్పిడి, బిల్లింగ్ సమస్యలు, మీటర్ రీడింగ్, నూతన వ్యవసాయ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, విద్యుత్ కొత్త లైన్ల నిర్మాణం తదితర అవసరాల నిమిత్తం ప్రతిరోజు వినియోగదారులు వస్తుంటారు. అద్దె భవనాల్లో సెస్ విధుల నిర్వహణలో ఇబ్బందులపై పలుసార్లు సాక్షిలో కథనాలు వచ్చాయి.

వినియోగదారులకు మేలు



సెస్ సేవాసదన్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం మంచి పరిణామం. సెస్ కార్యాలయానికి సొంత భవనం లేక చాలాసార్లు వివిధ పనుల నిమిత్తం వచ్చిన విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. సెస్‌కు సొంత భవన నిర్మాణంతో ఇబ్బందులు తొలగుతాయి.

– గుడి శ్రీనివాసరెడ్డి, రైతు, తడగొండ

ఆరు విద్యుత్ సబ్ స్టేషన్లు



బోయినపల్లి సెస్ పరిధిలో 23 గ్రామాల తోపాటు కొడిమ్యాల మండలం నల్లగొండ, తిప్పాయిపల్లి గ్రామాలున్నాయి. మండలంలో ఆరు విద్యుత్ సబ్ స్టేషన్లున్నాయి. నిత్యం పనుల నిమిత్తం కార్యాలయానికి పెద్ద సంఖ్యలో వినియోగదారులు వస్తుంటారు.

– ప్రశాంత్, సెస్, ఏఏఈ, బోయినపల్లి

చైర్మన్ సహకారంతో నిధులు



బోయినపల్లి మండల కేంద్రంలో సెస్ సంస్థకు 20 గుంటల మేర స్థలం ఉందని, సెస్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావుకు పలుసార్లు విజ్ఞప్తి చేశాం. సెస్ చైర్మన్, సెస్ ఎండీ సహకారంతో భవన నిర్మాణానికి రూ.66లక్షల నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరు చేసిన చైర్మన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– కొట్టెపెల్లి సుధాకర్, సెస్ డైరెక్టర్, బోయినపల్లి



గొల్లపల్లిలో రహదారిపై వృక్షం



నిలిచిన వాహనాలు

భారీ వృక్షం తొలగింపు

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లి శివారులోని సిరిసిల్ల–కామారెడ్డి రహదారిలో ఉన్న మహా వృక్షం నుంచి మంటలు వ్యాపించడంతో అధికారులు, గ్రామస్తులు అప్రమత్తమై గురువారం వృక్షాన్ని తొలగించారు. ప్రధాన రహదారిపై వృక్షాన్ని తొలగించడం మూలంగా సుమారు మూడు గంటలపాటు రోడ్డుపై వాహనాలు నిలిచి ప్రయాణికులు, సామాన్యులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. రోడ్డు పక్కన ఉన్న పెద్ద చెట్టు మొదలు నుంచి దగ్ధమవుతూ పైవరకు అంతర్గతంగా దహనమైంది. అంతుపట్టని విధంగా చెట్టు దగ్ధం కావడంపై పలువురు పలు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. అయితే అంతకుముందు రోజు భారీ ఉరుములు, మెరుపులతో చెట్టు మొదట్లో పిడుగు పడడం మూలంగానే మంటలు వ్యాపించి ఉంటాయని అంటున్నారు. విద్యుత్ తీగలు చెట్టును ఆనుకొని ఉండడంతో మంటలు వచ్చాయనే పలు రకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహా వృక్షానికి మంటలు వ్యాపించి ప్రమాదకరంగా మారడంతో.. ఎస్సై లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు, సెస్ అధికారులు, గ్రామస్తులు రంగప్రవేశం చేసి దగ్గరుండి ఆర్‌అండ్‌బీ అధికారుల అనుమతితో వృక్షాన్ని నేలమట్టం చేశారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు



ఎల్లారెడ్డిపేటలో అశ్వం నృత్యం

ఎల్లారెడ్డిపేట: సింగారం గ్రామంలోని దట్టమైన అడవిలో ఉన్న దర్శావలి గుట్టపై వెలసిన దుర్వేషావలి దర్గా వద్ద గురువారం ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సింగారంకు చెందిన షేక్ అజీజ్‌బాయి దర్గా వద్ద ప్రతి ఏడాది తన సొంత ఖర్చులతో ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తూ ఈ కార్యక్రమానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారు. గురువారం సాయంత్రం ఎల్లారెడ్డిపేట నుంచి సందల్(గంధం)ను ఊరేగింపుగా దర్శావలి గుట్ట వరకు తీసుకెళ్లారు. దారి పొడవునా అశ్వాలతో ప్రత్యేక నృత్యాలు, డప్పు వాయిద్యాలు, మత గురువుల ప్రార్థనలతో ఊరేగింపు సాగింది. ఊరేగింపుగా సందల్‌ను తీసుకెళ్లి దర్శావలి దర్గాలో మత గురువులు సందల్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రముఖుల రాక

ఉత్సవాలకు ప్రముఖులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్, నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి హాజరయ్యారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ ముస్లిం మత గురువులు హాజరయ్యారు.

ఆకట్టుకున్న కవ్వాలి ప్రదర్శన

రాత్రి 8 గంటల నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ముంబై నుంచి వచ్చిన కవ్వాలి బృందం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతి ఏడాది ముంబై నుంచి నిర్వాహకులు అజీజ్‌బాయి కళాకారులను రప్పించి కత్తి, డోలు వాయిద్యాలు, ఆటపాటలతో ప్రజలు, నాయకులు, మత గురువులను ఉత్సాహపరుస్తారు.

దత్త ఆలయంలో పూజలు



బోయినపల్లి: మిడ్ మానేరు ప్రాజెక్టు పరిసరాల్లో ఉన్న వరదవెల్లి గుట్టపై వెలసిన శ్రీగురు దత్తాత్రేయ స్వామి ఆలయంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు ప్రసాద వితరణ చేశారు. పొన్నం అశోక్‌గౌడ్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, గొట్ల వెంకటేశం, నాగుల శ్రీనివాస్, పూజారి రత్నాకరశర్మ తదితరులున్నారు.

రాజీవ్ యువ వికాసానికి సిబిల్ తప్పనిసరి

తంగళ్లపల్లి: రాజీవ్ యువ వికాసానికి సిబిల్ స్కోర్‌తో సంబంధం లేదంటూ సాక్షాత్తు రాష్ట్ర మంత్రులు చెబుతున్న మాట నీటిమూటగానే మిగిలుతోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితి మంత్రులు చెప్పిన దానికి భిన్నంగా ఉంది. ఎంపీడీవో కార్యాలయ, బ్యాంకు అధికారులు రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ చెక్ చేసేందుకు తలమునకలయ్యారు. గురువారం తంగళ్లపల్లి ఎంపీడీవో కార్యాలయాన్ని సాక్షి సందర్శించగా.. అధికారులు సిబిల్ స్కోర్ చెక్ చేస్తూ కనిపించారు. ఇదేమిటని ప్రశ్నించగా.. సిబిల్ స్కోర్ తప్పనిసరని ప్రభుత్వం నుంచి తమకు ఎటువంటి ఆదేశాలు రాలేదని తెలిపారు. కాగా లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

రోడ్డు పక్కనే చికెన్ వ్యర్థాలు



రోడ్డు పక్కన చికెన్ వ్యర్థాలు

ఇల్లంతకుంట: మండల కేంద్రం నుంచి అనంతారం వెళ్లే బీటీ రోడ్డు పక్కన చికెన్ వ్యర్థాలు వేయడంతో.. ఆ రోడ్డుపై వెళ్లేవారు దుర్వాసన భరించలేకపోతున్నారు. కుక్కలు, పందులు, కాకులు ఉదయం సమయంలో వ్యర్థాలను తింటూ బాటసారులకు భయాందోళన కలిగిస్తున్నాయి. ఇళ్లలోని వ్యర్థాలు, భోజనం తిన్న ప్లేట్లు, పనికిరానివన్నీ రోడ్డు పక్కనే వేస్తున్నారు. రోడ్డు వెంట ఇల్లంతకుంట ఫ్యాక్స్ కేంద్రం, పెట్రోల్ బంక్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బ్రిక్స్ ఫ్యాక్టరీలున్నాయి. వ్యర్థాలను రోడ్డు వెంట వేయకుండా గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నోటీసులు జారీ చేశాం



రోడ్డు వెంట చికెన్ వ్యర్థాలు వేయొద్దని ఇప్పటికే రెండుసార్లు చికెన్ సెంటర్ వాళ్లకు నోటీసులిచ్చాం. ఇంట్లోని వ్యర్థాలు పంచాయతీ చెత్త బండిలోనే వేయాలి. గతంలో వ్యర్థాలను దహనం చేశాం.

– సుంకపాక వరుణ్‌కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి

నిరుపేదలకు వరం.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్



తంగళ్లపల్లిలో చెక్కులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

తంగళ్లపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు నిరుపేద ఆడబిడ్డల పెళ్లికి వరం లాంటివని సిరిసిల్ల ఆర్డీవో సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మార్కండేయ ఫంక్షన్ హాలులో జిల్లా గ్రంథాలయాల చైర్మన్ నాగుల సత్యనారాయణ, ఏఎంసీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప–తిరుపతిరెడ్డితో కలిసి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. మండలవ్యాప్తంగా 96 మంది లబ్దిదారులకు రూ.96,11,136 విలువైన చెక్కులు అందజేసినట్లు తెలిపారు. తహసీల్దార్ జయంత్‌కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, ఏఎంసీ డైరెక్టర్లు అరెపల్లి బాలు, పరశురామ్, కాంగ్రెస్ నాయకులు, మండలవాసులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేత



చెక్కులు అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: రాజన్నపేటలో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బీఆర్‌ఎస్ నాయకులు గురువారం అందజేశారు. బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఏర్పుల స్వామి, మాజీ ఎంపీటీసీ నమిలికొండ శ్రీనివాస్, నాయకులు ద్యాప రాజు, గోగూరి రాజు, శ్రీనివాస్, సంతోష్, తిరుపతి, కై లాసం, రాములు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వీర్నపల్లి: అడవిపదిర, కంచర్ల సబ్ స్టేషన్ పరిధిలోని 33 కేవీ లైన్‌లో చెట్ల కొమ్మలు కొట్టే కార్యక్రమమున్నందున వీర్నపల్లి, కంచర్ల, అడవిపదిర సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయముంటుందని ఏఈ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధి పనులపై విచారణ

వీర్నపల్లి: మద్దిమల్ల, బంజేరు, సీతారాంనాయక్‌తండా గ్రామాల్లో ఉపాధిహామీ పనుల్లో ఫిర్యాదుపై గురువారం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నర్సింహులు గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. నర్సింహులు మాట్లాడుతూ.. ఉపాధిహామీ కూలీలు, ప్రజల అభిప్రాయాలు తీసుకొని నివేదిక జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి అందించామని తెలిపారు. అసిస్టెంట్ విజిలెన్స్ మేనేజర్ అరుణ్, ఏపీవో శ్రీహరి, సాంకేతిక సహాయకులు వనిత, గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, ఉపాధిహామీ కూలీలు, ప్రజలు పాల్గొన్నారు.

మరమ్మతు చేపట్టిన విద్యుత్ శాఖ

సాక్షి స్పందన



ముస్తాబాద్: పోతుగల్ బాలుర వసతి గృహం ఎదుట ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ పోల్‌కు విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతు చేపట్టారు. సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. విద్యుత్ పోల్ కింద నీటి పైపులైన్ లీకై స్తంభం కింద పెద్ద గుంత ఏర్పడింది. పైపులైన్ లీకు కాకుండా పనులు చేపట్టి స్తంభం గుంతను పూడ్చే పనులు చేశారు.



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని మొదటి బైపాస్ ప్రధాన రహదారిపైనే మటన్ దుకాణాలు ఏర్పాటు చేశారు. రహదారిపై దుకాణాల నిర్వహణతో ప్రయాణికులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సమీప నివాసాల వారు వ్యర్థాల వాసనతో రోగాల బారిన పడుతున్నారు. రహదారిపై నుంచి మటన్ దుకాణాలను వేరే చోటుకు మార్చాలని గ్రామస్తులు చేస్తున్న విజ్ఞప్తులను పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా దుకాణాలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించి రోడ్డుపై నుంచి మార్చాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ప్రవీణ్‌కుమార్, ఈవో, ఎల్లారెడ్డిపేట, సెల్ నంబర్: 8074541033

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

అధిక దిగుబడులపై అవగాహన



గంభీరావుపేట: మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

గంభీరావుపేట: రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు పాటించాల్సిన పద్ధతులపై వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా లింగన్నపేట రైతు వేదికలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కనకదుర్గ, డాక్టర్ సతీశ్, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్, ఏఎంసీ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, డైరెక్టర్ ఆజామ్, రాజారామ్, మండల వ్యవసాయాధికారి సలావుద్దీన్, ఉద్యానవన అధికారి లోకేశ్ రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవోలు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: వట్టిముల రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల, అధికారుల ఆధ్వర్యంలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పంటలకు సరైన మోతాదులో యూరియా ఉపయోగించడం, పచ్చిరొట్టె ఎరువులు, వర్మీ కంపోస్ట్, పశువుల ఎరువు వాడడం, సాగునీటి యాజమాన్యం, కూరగాయల సాగు, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం, వేప సంబంధిత పురుగుల మందులు వాడటం తదితర అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. డా.రజియా సుల్తానా, ఏడీఏ రామారావు, డా.ఎ.శ్రీనివాస్, విత్తన అధికారి జి.మౌనిక, అగ్రికల్చర్ ఆఫీసర్ వి.వినిత, వ్యవసాయ విస్తరణాధికారి మసూద్ పాషా, ప్రేమ్ సాయి, ప్రీ యూనిక్ ఆయిల్ పామ్ మేనేజర్, విద్యార్థులు సాయివర్షిత్, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



రైతులతో మాట్లాడుతున్న రవిశంకర్

బోయినపల్లి: అకాల వర్షంతో మండలంలో తడిసిన రైతుల ధాన్యాన్ని ఎలాంటి కొర్రీలు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. తడగొండ గ్రామ ప్యాడీ సెంటర్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. సీఎం రేవంత్‌రెడ్డికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ అన్నదాతలపై లేదని విమర్శించారు. నాయకులు చిందం రమేశ్, కట్ట లింగయ్య, గుంటి శంకర్, నిమ్మ శ్రీనివాసరెడ్డి, మహ్మద్ అజ్జూ, బత్తిని కమల్, రాజేశ్, బాపురెడ్డి తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గాయపడ్డ నారాయణరెడ్డి



క్షతగాత్రుడు హనుమాన్ స్వామి సురేశ్


తంగళ్లపల్లి: బద్దెనపల్లి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. గురువారం ఉదయం బాలమల్లుపల్లెకు చెందిన వృద్ధుడు కస్తూరి నారాయణరెడ్డి తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై స్వగ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన హనుమాన్ స్వాములు కొండగట్టుకు పాదయాత్రగా వెళ్తుండగా.. వారిని వేగంగా ఢీకొట్టాడు. స్వాములు కన్నెబోయిన ప్రశాంత్‌కు ఎడమ చెయ్యి, పందిళ్ల సురేశ్‌కు ఎడమ కాలు విరిగింది. నారాయణరెడ్డి కూడా గాయాలపాలయ్యాడు. స్వాములు తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గంభీరావుపేట: మల్లారెడ్డిపేటకి చెందిన శేఖర్(25) అనే యువకుడు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. రెండు రోజుల క్రితం మల్లారెడ్డిపేట గ్రామ శివారులో వడ్ల కుప్పను ఢీకొనడంతో రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఖలీల్ అనే వ్యక్తి అదేరోజు మృతిచెందగా.. శేఖర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోయినపల్లి: కోరెం కొండ పోచమ్మ ఆలయ పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పోరండ్ల అనిల్‌కుమార్ గురువారం తెలిపారు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో వేములవాడ మూలవాగు నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ కనిపించడంతో పట్టుకున్నామన్నారు. డ్రైవర్ వెంకటేశ్‌తోపాటు యజమానిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.



కారెక్కిన శునకాలు

సిరిసిల్ల: సిరిసిల్ల పెద్ద బజారులో ఓ రెండు ఊర కుక్కలు కారెక్కి నిద్రిస్తున్నాయి. కారును యజమాని పార్క్ చేసి వెళ్లగా.. ఆ కారు పైకి రెండు కుక్కలు ఎక్కి దర్జాగా విశ్రమిస్తున్నాయి. రూ.లక్షలు పెట్టి కొన్న కారుపై శునకాలు విశ్రాంతి తీసుకోవడం కారు యజమాని చూస్తే మాత్రం అవాక్కవుతారు.